## జనవరి నుంచి నైనీలో బొగ్గు ఉత్పత్తి

హైదరాబా ద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : ఒడిశా రాష్ట్రంలోని నైనీ కోల్‌బ్లాక్‌కు అన్ని రకాల అనుమతులొచ్చాయని, జనవరి నుంచి ఈ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అధికారులను ఆదేశించారు. బొగ్గు వెలికితీతకు ముందు కోల్ బంకర్, విద్యుత్తు సబ్‌స్టేషన్, జనరేటర్ వంటి వాటిని నెలకొల్పాలని, బొగ్గు రవాణాకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సింగరేణి భవన్ నుంచి శుక్రవారం అన్ని ఏరియాల జీఎంలతో సీఎండీ సమీక్షించారు. కొత్తగా రిక్రూట్ అయిన వారికి ఈ నెల 10లోగా నియామక ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించారు.

## కార్మికుల సమస్యలు పట్టని గుర్తింపు సంఘం

కృష్ణ కాలనీ, నవంబర్ 1: సింగరేణిలో ఇటీవల గెలుపొందిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీలు కార్మికుల సమస్యలను పక్కనపెట్టి తమ స్వలాభాల కోసమే పనిచేస్తున్నాయని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రియాజ్ అహ్మద్, కో కన్వీనర్ ఐ కృష్ణ, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సింగరేణి ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు. మందమర్రి, భూపాలపల్లితోపాటు మరి కొన్ని ఏరియాల్లో గుడి కమిటీ అకౌంట్‌పై యూనియన్ చందా (కార్మికుల సభ్యత్వం) రికవరీ వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## నిమ్స్‌లో బాలలకు ఉచిత ప్లాస్టిక్ స్క్రీనింగ్

ఖైరతాబాద్, నవంబర్ 1: నిమ్స్ దవాఖానలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో పిల్లలకు ఈ నెల 9 వరకు ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణమొర్రి, క్రానియో ఫేషియల్ వైకల్యాలు, పుట్టుకతో వచ్చే పక్షవాతం, కాలిన, ప్రమాదవశాత్తు ఏర్పడిన గాయాల మచ్చలతో బాధపడుతున్న 12 నుంచి 14 ఏండ్ల లోపు చిన్నారులకు పూర్తిగా ఉచితంగా చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య పాత ఔట్ పేషెంట్ బ్లాక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని రూమ్ నం.8లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## గవర్నర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): గవర్నర్ ఎక్స్‌లెన్స్ అవార్డులు-2024 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బీ వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడ లు, సాంస్కృతిక విభాగాల్లో ఈ పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు వివిధ రంగాల్లో కృషి చేసిన సంస్థలు, సొసైటీలు ఈ నెల 23 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన సంస్థలకు పు రస్కారం కింద రూ. 2 లక్షలు, ప్రశంసాపత్రం అందజేయనున్నారని వెల్లడించారు. ఆసక్తిగల ఆర్గనైజేషన్లు governor .telangana.govt.in, గవర్నర్ ముఖ్య కార్యదర్శి, గవర్నర్ సెక్రటేరియట్, రాజ్‌భవన్, సోమాజిగూడ, హైదరాబాద్ 500041లో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

## ఎక్సైజ్ పోలీసుల విచారణకు రాజ్ పాకాల

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఫ్యామిలీ పార్టీ కేసులో రాజ్‌పాకాల శుక్రవారం చేవెళ్ల ఎక్సైజ్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో కలిసి వచ్చిన రాజ్ పాకాలను రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో విచారించారు.

## గిరిజన వర్సిటీకి 211 ఎకరాలు

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లాలో ఏర్పాటు చేయనున్న సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీకి 211.26 ఎకరాలను కేటాయిస్తూ రెవెన్యూ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు జిల్లా కేంద్రంలోని రూ.10.58 కోట్ల విలువైన స్థలాన్ని యూనివర్సిటీకి అప్పగిస్తున్నట్టు వెల్లడించింది.



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్ కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్‌పై నిలిచిన నీటిని ఎత్తిపోస్తున్న రైతులు

# కర్షకుల కష్టార్జితం 'నీళ్ల'పాలు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యం
- పలుచోట్ల నేలవాలిన వరిచేలు
- ఆందోళనలో అన్నదాతలు

నమస్తే నెట్‌వర్క్, నవంబర్ 1 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం, నిర్మల్ మండలం వెంగ్వాపేట్, డ్యాంగాపూర్, చిట్యాల్, ముజ్గి, రత్నాపూర్‌కాండ్లీ, నీలాయిపేట్, మేడిపెల్లి గ్రామాల్లో పంటలు నేలకొరగడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. నిర్మల్ పట్టణంలో ఎన్టీఆర్ స్టేడియంలో పటాకుల దుకాణాలు, ఆర్డీవో కార్యాలయంలోకి వరద చేరింది. లోకేశ్వరం మండలం పొట్‌పెల్లి (బీ)లో బాండోల్ల రమేశ్ బొప్పాజీకి చెందిన ఎద్దు పిడుగుపాటుకు మృతి చెందింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో ఆరబెట్టిన సోయాబీన్ తడిసింది.

మంచిర్యాల భీమిని మండలం వడాలలో విఠల్‌కు చెందిన ఎకరం వరి నేలకొరిగింది. దండేపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన గడ్డం నాగమ్మ(31) పిడుగుపడి మృతిచెందింది. కాసిపేట మండలం మల్కేపల్లి, దేవాపూర్, పెద్దనపల్లిలో వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాండూర్ మండలం గోపాల్‌నగర్‌లో రైతు శ్రీనివాస్‌కు చెందిన 5 ఎకరాల వరి నేలకొరిగింది. నెన్నెల మండల కేంద్రంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దవ్వగా, పలుచోట్ల వడ్లు కొట్టుకుపోయాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో ఆరుగాలం పడ్డ కష్టమంతా నీళ్లపాలైందని అన్నదాతలు ఆందోళన



నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో వర్షానికి నేలకొరిగిన పంటను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

చెందారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,008 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించగా ఇరవై శాతం ప్రారంభమయ్యాయి. మెదక్, దుబ్బాక, సిద్దిపేట మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిపోయింది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు దాటినా ఇంతవరకు కొనలేదని రైతులు వాపోతున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు రైతులు విలవిలలాడుతున్నారు.కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం, కొయ్యగుట్ట, జక్కల్‌దానితండా, బోర్లం క్యాంపు, లింగంపేట మండలం భవానీపేట, జల్దిపల్లి, ముంబాజీపేట, రాంపూర్, శెట్పల్లి, పర్మళ్ల, మెంగారం, బోనాల్, బాయంపల్లితోపాటు నాగిరెడ్డిపేట, లింగంపేట, రుద్రూర్, మహ్మద్‌నగర్ మండలంలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల్లో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానాతంటాలు పడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్ర శివారులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు కొట్టుకుపోయాయి. రెడ్డికాలనీలో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## అప్పుల భారంతో రైతు ఆత్మహత్య

**రుణమాఫీ కూడా కాలేదని మనస్తాపం**

ఏటూరునాగారం, నవంబర్ 1: పంట దిగుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏటూరునాగారం ఎస్సై తాజుద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు చెన్నూరి మల్లయ్య(55) ఎనిమిదెకరాల్లో వ్యవసాయం చేయగా, ఇందులో ఐదు ఎకరాల్లో మిర్చి, మూడు ఎకరాల్లో వరి సాగు చేశాడు. నాలుగేండ్లుగా పంట దిగుబడి రాకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టం వచ్చింది. నిరుడు కూడా మిర్చికి ధర లేకపోవడంతో ఏసీలో నిల్వ చేసుకున్నాడు. ఆలస్యంగా విక్రయించినప్పటికీ అనుకున్న ధర రాలేదు. నాలుగేండ్ల క్రితం చిన్న కుమార్తె వివాహానికి కూడా అప్పు చేశాడు. సుమారు రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి.



మల్లయ్య (ఫైల్)

బ్యాంకులో ఉన్న అప్పు రూ.2 లక్షల వరకు మాఫీ కాలేదు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపంతో ఈనెల 25న పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## పోలీసు కిష్టయ్య భార్యకు పదోన్నతి

- ఎట్టకేలకు లైబ్రేరియన్‌గా ప్రమోషన్ ఉత్తర్వులు
- తెలంగాణవాదుల ఒత్తిడితో దిగొచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అమరుడు పోలీసు కిష్టయ్య భార్య పద్మావతికి ఎట్టకేలకు పదోన్నతి దక్కింది. సుదీర్ఘ పోరాటం తర్వాత ఇంటర్ విద్య కమిషరేట్ అధికారులు ఆమెకు శుక్రవారం లైబ్రేరియన్ పదోన్నతి కల్పించారు. వాస్తవానికి గత ఆగస్టులో ని ర్వహించిన డీపీసీలో లైబ్రేరియన్‌గా పదోన్నతికి లైన్‌క్లియర్ అయినా కొందరు అధికారుల వైఖరితో ఆమె పదోన్నతి దక్కించుకోలేకపోయింది. అప్పట్లో తక్కు వ పోస్టులుండగా, ముగ్గురు తమకు పదోన్నతి అవసరం లేదని రాసిచ్చినా అధికారులు పద్మావతికి పదోన్నతి కల్పించలేదు. ఇదే విషయంపై 'అమరుడి భార్యకు అష్టకష్టాలు' శీర్షికన నమస్తే తెలంగాణలో సెప్టెంబర్‌లో కథనం ప్రచురితమైంది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి తనకు న్యాయం చేయాలని పద్మావతి వేడుకున్నారు. ఎట్టకేలకు శుక్రవారం పద్మావతికి పదోన్నతి కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అమరుడి భార్య అని చూడకుండా పద్మావతిని దుర్భాషలాడిన, వ్యంగ్యంగా తీవ్ర మనోవేదనకు గురిచేసిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కరెంట్‌షాక్‌తో రైతు మృతి

బిజినేపల్లి, నవంబర్ 1 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. బిజినేపల్లి మండలం వసురాంతండా పంచాయతీలోని అలుగుతండాకు చెందిన మాల్యానాయక్ (34)కు రెండున్నర ఎకరాల పొలం ఉన్నది. మరో రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని వేరుశనగ పంట సాగు చేశాడు. బోరు మోటర్‌కు సంబంధించి సర్వీస్ చార్జీలు చెల్లించకపోవడంతో విద్యుత్తు అధికారులు సరఫరా నిలిపివేశారు. రెండు మూడు రోజులుగా నీళ్లులేక పొలం ఎండుతుండటంతో చేసేది లేక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్తు ఏ-బీ స్విచ్ ఆఫ్ చేసి కనెక్షన్ సరిచేసేందుకు వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

## అంగన్‌వాడీల్లో ఆహారాన్ని పరిశీలించాలి

**డీజీఆర్వోలకు ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆదేశాలు**

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): డిస్ట్రిక్ట్ గ్రీవియన్స్ రెడ్రసల్ ఆఫీసర్లు (డీజీఆర్వోలు) తరచుగా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని, వాటిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందుతున్నదో లేదో పరిశీలించాలని తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం ఆయన 33 జిల్లాలకు చెందిన డీజీఆర్వోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫుడ్ కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, అంగన్‌వాడీల నుంచి భోజనాన్ని ఇండ్లకు తీసుకెళ్లే విధానానికి స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల నోటీసు బోర్డుల్లో సంబంధిత అధికారుల మొబైల్ నంబర్లను పెట్టాలని, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో విద్య, వైద్యారోగ్య, మహిళా-శిశు సంక్షేమ, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్**

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. శుక్రవారం శిబిరాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన సచివాలయంలో విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కలిపి 2210 ఉచిత పశువైద్య గర్భకోశ శిబిరాలను నిర్వహించనున్నామని వెల్లడించారు.

# అర్హతలు లేని వారికే అందలం

- మైనార్టీ గురుకులంలో 'ప్రైవేట్' పెత్తనం
- ఉన్నతస్థానాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- మెంటార్ల పేరిట నియామకానికి కసరత్తు
- సీనియర్లను కాదని జూనియర్ల నియామకం

హైదరాబాద్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): అర్హతలు లేకున్నా సరే, నిబంధనలు వర్తించకున్నా ఫర్వాలేదు.. ఉన్నతాధికారులకు నచ్చితే చాలు అందలమెక్కిస్తారు. నచ్చిన పోస్టులో కూర్చోబెడతారు. ఇందుకు మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులంలో నియమించిన మెంటార్ పోస్టులే నిలువెత్తు నిదర్శనం. దీనిపై గురుకుల సంఘాలు మండిపడుతున్నాయి. అదీగాక ఇటీవల గురుకుల టీచర్ల నుంచి ఎలాంటి అప్లికేషన్స్ తీసుకోకుండానే నచ్చినవారిని ఎంపిక చేసి ఉత్తమ అవార్డులు ఇచ్చారని నిప్పులు చెరుగుతున్నాయి. మైనార్టీ గురుకుల సొసైటీలో సెక్రటరీ తప్ప ఇతర పోస్టుల్లో ఇప్పటివరకు ఎవరూ లేరు. 8నెలల నుంచి జేఎస్ పోస్టు ఖాళీగానే ఉన్నది. అకడమిక్ బాధ్యతలన్నీ కూడా విశ్రాంత ఉద్యోగితోపాటు, ఔట్‌సోర్సింగ్‌లో నియామకమైన మరో ఇద్దరు మాత్రమే నిర్వర్తిస్తుండడం కొసమెరుపు. వారిద్దరూ ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటూ, సిబ్బందిపై పెత్తనం చెలాయిస్తూ సొసైటీ మొత్తాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడ్మిషన్లు సజావుగా కొనసాగకపోవడానికి, వేతనాలు సకాలంలో విడుదల కాకపోవడానికి సదరు ప్రైవేట్ వ్యక్తులే కారణమనే ఆరోపణలున్నాయి. ఎలాంటి దరఖాస్తులు తీసుకోకుండా, మార్గదర్శకాలు పాటించకుండా తమకు నచ్చిన వారిని, మెప్పించిన వారినే ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారనే ఆరోపణలున్నాయి.




### ఎస్‌ఆర్‌పీ వ్యవస్థ మళ్లీ పునరుద్ధరణ

గతంలో ఏ సొసైటీలో లేనివిధంగా విజిలెన్స్ టీం, అకడమిక్ కో ఆర్డినేటర్లు, అకడమిక్ కన్సల్టెంట్లు, సబ్జెక్ట్ రీసోర్స్‌పర్సన్స్(ఎస్‌ఆర్‌పీ) పేరిట మైనారిటీ సొసైటీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటేషన్‌పై 40మందికిపైగా ఉద్యోగులను సొసైటీ నియమించింది. వారు డెమోల పేరుతో తీవ్ర ఒత్తిడికి గురి చేయడంతోపాటు పెత్తనం చెలాయించడం, ప్రశ్నించిన వారికి మెమోలు ఇచ్చి సస్పెండ్ చేయడం వంటి ఆరోపణలతో ఎస్‌ఆర్‌పీ వ్యవస్థను సొసైటీ గతంలోనే రద్దు చేసింది. అయితే ఇప్పుడు తిరిగి మెంటార్స్ పేరిట మళ్లీ పునరుద్ధరించేందుకు సొసైటీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

### అర్హతలు లేకున్నా మెంటార్స్‌గా నియామకం

వాస్తవంగా అధ్యాపకులు, ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు పెంపొందించేందుకు, అందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు మెంటార్స్‌ను నియమించడం ప్రధాన ఉద్దేశం. సొసైటీలో రెగ్యులర్ ఉద్యోగులై ఉండి, ఎంఈడీ, ఎంఫిల్, పీహెచ్‌డీతోపాటు నెట్, సెట్ క్వాలిఫై అయిన వారికి, మైనార్టీ సొసైటీ క్యాడర్లలో బోధనానుభవాన్ని, మూడేండ్లపాటు పేపర్ల మూల్యాంకనం చేసిన అనుభవాన్ని, సైన్స్ ఫెయిర్లు, ఎక్స్‌ట్రా కరికులం యాక్టివిటీలో భాగస్వాములైన, ఆసక్తి ఉన్న వారిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా కనీస అర్హతలు, అనుభవం లేని, ఇంటర్ బోర్డ్ ఎగ్జాం పేపర్ ఎలా ఉంటుందో తెలియని వారిని కూడా మెంటార్‌గా ఎంపిక చేశారని గురుకుల ఉపాధ్యాయులు నిప్పులు చెరుగుతున్నారు. ఒక జాబ్ చార్ట్ లేకుండా, అప్లికేషన్ కాల్ ఫర్ చేయకుండా నచ్చిన వారిని మెంటర్‌గా నియమిస్తున్నారని, ఇదే కొనసాగితే సొసైటీ మొత్తం అప్రతిష్టపాలు కాకతప్పదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## 14 నుంచి హెచ్‌డబ్ల్యూవో సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో) పోస్టుల భర్తీకి ఈ నెల 14 నుంచి 30 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నాంపల్లిలోని తెలుగు వర్సిటీలో నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. జనరల్ కోటాలో 1:2, దివ్యాంగ అభ్యర్థులకు 1:5 నిష్పత్తిన సర్టిఫికెట్ వెరిఫికేన్ నిర్వహిస్తామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని టీపీజీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ సూచించారు. హాజరుకాని వారికి డిసెంబర్ 2 నుంచి 4వరకు నిర్వహిస్తామని తెలిపారు.

## 'ఉపాధి'ని పకడ్బందీగా అమలు చేయాలి

హైదరాబాద్, నవంబర్ 1(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. వచ్చే ఐదు నెలల్లో చేపట్టనున్న పనులకు రూ. 1371 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఈ స్కీం కింద వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## సోమశిల నుంచి శ్రీశైలంకు లాంచీ

- రేపటి నుంచి ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : సోమశిల, నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ సేవలు అందుబాటులోకి తెచ్చినట్టు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాంచీ సేవలు ఈ నెల 2 నుంచి ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. కృష్ణమ్మ ఒడిలో, నల్లమల పచ్చదనానికి చెందిన అందాలను వీక్షిస్తూ.. కృష్ణా నదిలో సాగే జల విహారానికి తెలంగాణ పర్యాటకశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ప్రయాణికుల కోసం టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి వివరాలతో పాటు టికెట్ బుకింగ్ కోసం https://tourism. telangana.gov.in/ వెబ్ సైట్‌ను సంప్రదించాలని కోరారు. సోమశిల నుంచి శ్రీశైలం వరకు, నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు సింగిల్ జర్నీలో పెద్దలకు రూ. 2,000, పిల్లలకు రూ.1,600, రౌండప్ (రానుపోను కలిపి) జర్నీలో పెద్దలకు రూ.3,000, పిల్లలకు రూ. 2,400 గా ధరలు నిర్ణయించారు. ఈ ప్యాకేజీలో లాంచీ ప్రయాణంతో పాటు టీ, స్నాక్స్ అందించనున్నట్టు మంత్రి ప్రకటించారు.

## మీ సమస్యలను సమాజానికి తెలపండి

**సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ**

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తేతెలంగాణ) : తమ ప్రాంతంలోని సమస్యలను, అవినీతిని సమాజానికి చూపించడం అనేది యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో 'ముందడుగు' యాప్ చేయబోతున్నదని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ముం దడుగు యాప్‌ను ఆయన ఆవిష్కరిం చి మాట్లాడారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో సమాజంలో జరుగుతున్న అవినీతి, ప్రజల సమస్యలు, నిజాయితీ వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేసేందుకు 'ముందడుగు' యాప్‌ను ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమం లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌం డర్ రాజేంద్ర పల్నాటి, ముందడుగు బృందం కొన్నె దేవేందర్, చెరుకూరి జంగయ్య, కోమటి రమేశ్‌బాబు, వరికుప్పల గంగాధర్, గీతానంద్ పాల్గొన్నారు.



మురహరిదొడ్డి గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న దుకాణం బాబు

## సొంత డబ్బులతో రోడ్డు బాగుచేశారు..

కృష్ణ/వెల్దండ, నవంబర్ 1: గుంతలమయంగా మారిన రోడ్లను సొంత డబ్బులతో బాగు చేసిన ఇద్దరు వ్యక్తులు ప్రజలు, వాహనదారుల మన్ననలు పొందారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూర్ పంచాయతీలోని టైరోడ్ నుంచి మురహరిదొడ్డి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. మురహరిదొడ్డి గ్రామానికి చెందిన దుకాణం బాబు సొంత డబ్బు రూ.7లక్షలతో రోడ్డు వేయించారు. బాబును స్థానికులు సన్మానించారు.

### మరమ్మతులు చేయించిన కానిస్టేబుల్

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్రకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ దండోత్కర్ ఎంకోజీ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో కానిస్టేబుల్ సొంత ఖర్చులతో కొమ్మలు తొలగించి రోడ్డును చదును చేయించారు.

## నేటితో ముగియనున్న భుజంగరావు బెయిల్

నాంపల్లి కోర్టులు, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ భుజంగరావు మధ్యంతర బెయిల్ గడువు శనివారంతో ముగియనున్నది. వైద్య కారణాల రీత్యా ఇప్పటివరకు ఆయన బెయిల్‌ను మూడుసార్లు పొడిగించిన నాంపల్లి కోర్టు.. ఈ గడువు ముగిసిన వెంటనే తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. కాగా, ఈ కేసులో మిగతా రిమాండ్ ఖైదీలుగా ఉన్న ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు రిమాండ్‌ను కోర్టు ఈ నెల 13 వరకు పొడిగించింది. ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావుతోపాటు మరో నిందితుడైన ఐన్యూస్ ఎండీ శ్రావణ్ కుమార్ విదేశాల్లో ఉండటంతో నాన్-బెయిలబుల్ వారెంట్ కొనసాగుతున్నది. ఇంటర్‌పోల్ ద్వారా వారిని అరెస్టు చేసేందుకు చర్యలు చేపట్టినట్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి ఇటీవల 14వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ కోర్టులో మెమో దాఖలు చేశారు. ఈ కేసులోని నిందితులంతా బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



అఘోరి ఇంటివద్ద ఏసీపీ, సీఐ

## అఘోరి గృహ నిర్బంధం

**మంచిర్యాల జిల్లా కుశ్నపల్లిలో..**

నెన్నెల, నవంబర్ 1 : ఆత్మార్పణం చేసుకుంటానని ప్రకటించిన అఘోరి మాతను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లికి చెందిన అఘోరి మాత అలియాస్ ఎల్లూరి శ్రీనివాస్ నవంబర్ ఒకటో తేదీన సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడి వద్ద ఆత్మార్పణం చేసుకుంటానని అక్టోబర్ 29న సంచలన ప్రకటన చేశారు. అదే రోజు రాత్రి సికింద్రాబాద్‌కు బయలుదేరగా, పోలీసులు అడ్డుకొని స్వగ్రామమైన కుశ్నపల్లికి భారీ భద్రత మధ్య తరలించి తల్లిదండ్రులకు అప్పగించారు. కుశ్నపల్లికి ఎవరూ రాకుండా అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. అఘోరి ఆత్మార్పణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నట్టు భక్తులు చెబుతున్నారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీఐ అబ్జలొద్దీన్ గ్రామంలో పటిష్ట భద్రత కల్పించారు.